క్లుప్తంగా

ఇఫ్తార్ విందు

జడ్చర్ల టౌన్: ఉపవాసదీక్షల వల్ల పేదల ఆకలి బాధలు తెలుసుకోవడమే ముఖ్య ఉద్దేశ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 8వ వార్డు హౌజింగ్‌బోర్డు కాలనీలో మహ్మద్ వల్లియొద్దీన్ గృహంలో ఏర్పాటు చేసిన ఉపవాస విందుకు ఆదివారం రాత్రి హాజరయ్యారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు



బాలానగర్: మండలంలోని అమ్మపల్లిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు సర్పంచ్ విజయలక్ష్మి సొంత ఖర్చుతో వాటర్‌ఫిల్టర్ ఏర్పాటు చేయించారు. శనివారం వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. రూ.5లక్షలు వెచ్చించి ఆర్‌ఓ వాటర్ ఫిల్టర్‌తో పాటు ప్రత్యేకంగా షెడ్ నిర్మింపజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతి, శ్రీనివాస్, రమేష్, జంగయ్య, చెన్నయ్య, శ్రీశైలం, గోవర్ధన్, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'కంటివెలుగు' ముగిసిన తర్వాత తమ సర్వీసును ఇతర శాఖల్లోనూ కొనసాగించాలని డాటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నర్సిములు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ జి.రవినాయక్‌ను సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మిర్జ్, సభ్యులు సృజన, రేఖ, దివ్య, జమీర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



గండేడ్: మండలంలోని చెల్మిల్లలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. వచ్చే నెలలో గ్రామస్తులు బొడ్రాయి ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. ఈ మేరకు ఆదివారం రామ్మోహన్‌రెడ్డి రూ.51వేల ఆర్థికసాయం అందజేశారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

జడ్చర్ల టౌన్: పట్టణంలో నిర్వహించే అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా సుంకసారి విజయ్ ఎన్నికయ్యారు. ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా రంగయ్య, కురుమూర్తి ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలేదీక్షలు ఆదివారం 68వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన యువకులు రిలేదీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పాలనా సౌలభ్యం కోసం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని యువకులు డిమాండ్ చేశారు. రిలేదీక్షలో వెంకటేష్, రవి, చిన్న, ఖాజ, బచ్చప్ప, రాజు, ఆనంద్, మల్లేష్, హనుమంతు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ్య సమ్మేళనానికి తరలిరావాలి

నవాబుపేట: నియోజకవర్గానికి సంబంధించి ఆత్మీయ సమ్మేళనానికి మండలంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కుటుంబ సభ్యులతో తరలి రావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, రైతుబంధు చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, కృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జామియా మసీదు అభివృద్ధికి కృషి చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన జామియా మసీదు కమిటీ కార్యదర్శి అబ్దుల్ జకీ హైదరాబాద్‌లో ఇటీవలే పవిత్ర మక్కా షరీఫ్ ఉమ్రాయాత్ర పూర్తిచేసుకొని వచ్చిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను కలిసి జామియా మసీదు అభివృద్ధిపై చర్చించారు. అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు నుంచి సహకారం అందించాలని కోరారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

రాజాపూర్: బీఆర్‌ఎస్ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాకముందు రాష్ట్రాన్ని 70ఏళ్లు పాలించిన పార్టీలు ఎందుకు అభివృద్ధి చేయలేదో తెలపాలని అన్నారు. అధికారం కోసం ఒక్కసారి ఛాన్స్ ఇవ్వాలంటూ కాంగ్రెస్, హిందుత్వం తీసుకొచ్చి ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మోడీ పాలనలో పేద ప్రజల సొమ్ము దోచుకుని అదానీ, అంబానీలకు పంచిపెడుతుందని విమర్శించారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మాదిరి సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదో గమనించాలని అన్నారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం రైతుబీమా, పెట్టుబడి సాయంగా రైతుబంధు, ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలతో అన్ని రంగాల్లో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని అన్నారు. తాగునీటి కోసం బిందెలు పట్టుకుని నల్లాల వద్దకు వెళ్లకుండా ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం అందించినట్లు గుర్తుచేశారు. పేపర్ లీక్ దోషులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం సిట్ ద్వారా దర్యాప్తు చేస్తున్నా ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టమన్నారు. గుజరాత్‌లో ఇప్పటి వరకు 13సార్లు పేపర్ లీకేజీ అయ్యిందని, ఇందుకు బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని తెలిపారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు బాద్మి శివకుమార్, వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బాలానగర్ ఎంపీపీ కమల, జెడ్పీటీసీ కల్యాణి, ఏఎంసీ చైర్మన్ రజిని, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావ్, శ్రీశైలంయాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మనోధైర్యంతో పరీక్షలు రాయాలి



మిడ్జిల్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పదో తరగతి విద్యార్థులు మనోధైర్యంతో వార్షిక పరీక్షలు రాయాలని జిల్లా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, పట్టణ అధ్యక్షురాలు మాధవి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు ప్రతి విద్యార్థి గంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని, హాల్‌టికెట్ వెంట తీసుకెళ్లాలన్నారు.

పరీక్షలకు సర్వం సిద్ధం..

జడ్చర్ల టౌన్: పదో తరగతి పరీక్షలకు మండలంలో సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం 1,711 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మండల కేంద్రంలో 7పరీక్ష కేంద్రాలు, కోడ్గల్‌లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ మంజులాదేవి తెలిపారు.

చిన్నచింతకుంట: మండలంలో చిన్నచింతకుంట, పెద్దవడ్డేమాన్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 520 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

మిడ్జిల్: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం 277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

నవాబుపేట: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ తెలిపారు. మొత్తం 730 మంది విద్యార్థులకు గాను మండలంలో మొత్తం 46 మంది సిబ్బందిని నియమించినట్లు వివరించారు.

మహమ్మదాబాద్: ఉమ్మడి మహమ్మదాబాద్, గండేడ్ మండలాల్లో 1,025 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఏటీఆర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాలలో 1997–98వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. ఆ రోజుల్లో తమకు చదువులు చెప్పిన గురువులను పాఠశాలకు ఆహ్వానించారు. నాటి ఉపాధ్యాయులు నారాయణ, శివరాములు, నామాల లక్ష్మణస్వామి, అశోక్‌కుమార్, రాంరెడ్డిలను పూర్వ విద్యార్థులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాంచంద్రయ్య, శేఖరాచారి, కవిత, కల్పన, సారిక, శ్వేత, హరీష్, కృష్ణయ్య, రాజశేఖర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిన్నచింతకుంట: గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నచింతకుంట మండలం గూడూర్‌లో రూ.7లక్షల నిధులతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాంతారావు, ఉపసర్పంచ్ శ్రీను, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసులు, కురుమూర్తి స్వామి దేవస్థానం కమిటీ సభ్యుడు నాగరాజు, నాయకులు మౌలాలి, బీమన్నగౌడ్, పెద్దరాజు, చింతలముని పాల్గొన్నారు.

జడ్చర్ల: మండలంలోని చిన్నఆదిరాల నుంచి చంద్రుతండా వరకు రూ.రెండున్నర లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు పనులను జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య ఆదివారం ప్రారంభించారు. జెడ్పీటీసీ నిధుల నుంచి రోడ్డు పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, సర్పంచ్ రవి, నాయకులు రవి, గోపాల్, శ్రీశైలం పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి



బైక్‌ర్యాలీ ప్రారంభిస్తున్న మాణిక్యం రాజు

జడ్చర్ల టౌన్: రాజ్యాంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను, రిజర్వేషన్లు కాపాడాల్సిన అవసరముందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం రాజు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని నాగసాలలో రాజ్యాంగం కాపాడాలంటూ కేవీపీఎస్ నిర్వహిస్తున్న బైక్‌ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏప్రిల్‌లో మహనీయుల జయంతులను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగం పెను ప్రమాదంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రిజర్వేషన్ల విషయంలోనూ రాద్ధాంతం చేస్తూ వాటిని తొలగించే ప్రయత్నాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ ఉపాధి లేకుండా పాలకులు చేస్తున్నారని విమర్శించారు. బైక్‌ర్యాలీ మొదటి రోజు కిష్టంపల్లి, బూర్గుపల్లి, ఆలూరు, బాదేపల్లి, గంగాపురం, చర్లపల్లి గ్రామాల్లో కొనసాగింది. కార్యక్రమంలో కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు శంకర్, నాగరాజు, లక్ష్మీదేవి, జగన్, సత్తయ్య, సాయిలు, బాల్ చెన్నయ్య పాల్గొన్నారు.

వేసవి స్పెషల్ ఫలుదా, లస్సీ



జిల్లా కేంద్రం క్లాక్‌టవర్‌లోగల ఓ ఫలుదా సెంటర్

ఇష్టంగా రుచిచూస్తున్న ప్రజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: వేసవికాలం వచ్చిందంటే చాలూ చల్లచల్లని పదార్థాలను తీసుకోవడానికి ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతారు. వేసవిలో కూల్ డ్రింక్‌లు, వివిధ రకాల పండ్ల జ్యూస్‌లు, నిమ్మకాయ షర్బత్‌ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. వేసవిలో 'ఫలుదా' (పాలు, డ్రైఫ్రూట్ పదార్థం), లస్సీకి ఎంతో క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలోనే ఫలుదా లభిస్తుండడం విశేషం. హైదరాబాద్ తరహాలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఫలుదా లభిస్తుంది. వేసవిలో ప్రజలు ఫలుదాను ఇష్టంగా రుచిచూస్తున్నారు. వేసవిలో దాహార్తీ తీర్చడంతోపాటు ఎన్నో పోషకగుణాలు ఉన్న ఫలుదా గ్లాస్ రూ.40 లభిస్తోంది.

ఫలుదా తయారీ విధానం..

పాలలో సబ్జి విత్తనాలు కలిపి గంటపాటు ఫ్రిజ్ లేదా ఐస్‌లో ఉంచుతారు. అనంతరం సబ్జితో కూడిన పాలను గ్లాస్‌లో వేసి అందులో ఖోవా, వివిధ రకాల డ్రైఫ్రూట్‌లను వేసి దానిపైన మీగడ వేసి వినియోగదారులకు అందిస్తారు. వేసవిలో ఇతర జ్యూస్‌లకంటే ఫలుదాకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.



తయారు చేసిన ఫలుదా

నోరూరిస్తున్న లస్సీ..

వేసవిలో పెరుగుతో తయారుచేసే లస్సీకి కూడా ప్రముఖమైన స్థానం ఉంది. ఈ లస్సీ మారుమూల గ్రామీణ ప్రాంతంలో కూడా లభిస్తుంది. గతంలో గ్లాస్‌లో పెరుగు పోసి ఇచ్చేవారు. ప్రస్తుతం పెరుగులో డ్రైఫ్రూట్స్‌తో పాటు ఖోవా, చెర్రీస్ వేస్తుండడంతో చాలా రుచికరంగా ఉంటుంది. గ్లాస్ సైజును బట్టీ లస్సీ రూ.25లు, రూ.35 లభిస్తుంది.

15ఏళ్ల నుంచి..

15ఏళ్ల నుంచి క్లాక్‌టవర్‌లో ఫలుదా సెంటర్ నడుపుతున్నా. వేసవిలో ఫలుదా తాగడానికి చాలా మంది ఇష్టపడుతారు. ఫలుదాలో డ్రైఫ్రూట్, ఖోవా వేస్తుండడం వల్ల ఆరోగ్యపరంగా బాగుంటుంది. లస్సీని కూడా ప్రత్యేకంగా తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నాం.

– మహ్మద్ షబ్బీర్‌అలీ, ఫలుదా సెంటర్, మహబూబ్‌నగర్

వడ్డీరేట్లను సద్వినియోగం చేసుకోండి

జడ్చర్ల టౌన్: భారీగా పెరిగిన పోస్టల్ వడ్డీరేట్లను సద్వినియోగం చేసుకోవాలని బాదేపల్లి అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న పొదుపుదారులకు వడ్డీరేట్ల పెరుగుదల ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. 2023 ఏప్రిల్ త్రైమాసికానికి సంబంధించి నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై 7శాతం, సుకన్య సమృద్ధి పథకంపై 7.5 నుంచి 8శాతానికి, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీంపై 8 నుంచి 8.2శాతానికి, రికరింగ్ డిపాజిట్‌లపై 5.8 నుంచి 6.2శాతానికి పెంచటం జరిగిందన్నారు. అలాగే రెండేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై 6.8 నుంచి 6.9శాతానికి పెంచారని, మూడేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 6.7 నుంచి 7శాతానికి, ఐదేళ్ల పథకంపై 7నుంచి 7.5శాతానికి పెంచారన్నారు. నెలవారి ఆదాయంపై 7.1 నుంచి 7.4 శాతానికి పెంచటం జరిగిందన్నారు. వీటితో పాటు ప్రత్యేక డ్రైవర్ కొత్తపథకం ప్రారంభమైందని, పాత సేవింగ్స్ ఖాతాల పునరుద్ధరణకు ఈనెల 30వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అఖండ భజనలో భజన మండలి సభ్యులు

భూత్పూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ జిల్లా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలోని భూత్పూర్ పట్టణంలోని శ్రీ ఆంజనేయ భజన మండలి సభ్యులు శనివారం రాత్రి ఆఖండ భజనలో పాల్గొని అన్నమయ్య సంకీర్తనలు, వేంకటేశ్వరస్వామి భక్తిగీతాలు పాడారు. ప్రతి యేటా సంవత్సరంలో రెండు, మూడు పర్యాయాలు తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం పాలకవర్గం నుంచి పిలుపు రావడంతో భూత్పూర్ శ్రీ ఆంజనేయ భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించి వస్తారు. కార్యక్రమంలో భూత్పూర్ శ్రీ ఆంజనేయ భజన మండలి అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య గౌడ్, ప్రచార కార్యదర్శి శ్యాంసుందర్ చారి, కృష్ణయ్య, శ్రీను, పరశురాం పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని 16వ వార్డు పరిధిలోని బోయపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు 100మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వారికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అజ్జు, ఎండీ అఖిల్, షకీల్, జహంగీర్, అబ్దుల్ హఫీజ్, షకీల్, జమీల్ అహ్మద్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌కాలనీలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ఆదివారం మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం 48వ వార్డు ప్రజలతో ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, ముడా చైర్మన్ గంజి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడదాం



వేములలో ప్రచారం చేస్తున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

అడ్డాకుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. మూసాపేట మండలం వేములలో ఆదివారం జిల్లా నాయకుడు ఉంద్యాల రాఘవరెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని తెలిపారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని అన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి నిర్మాణం కోసం రూ.5లక్షలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్, టీసీ శ్రీనివాస్, రాఘవరెడ్డి, రాఘవేందర్‌గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, రాందాస్, నరోత్తంరెడ్డి, సుధాకర్, నర్సిములు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవమార్గంలో పయణించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం క్రిస్టియన్‌కాలనీ ఎంబీ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో పాం సండే (మట్టల ఆదివారం) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఈతమట్టలతో ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు గీతాలు ఆలపిస్తూ బోయపల్లిగేట్, తెలంగాణ చౌరస్తా, సత్యం చౌరస్తా మీదుగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరండ్ జానేష్, సండే స్కూల్ సూపరింటెండెంట్ సువర్ణ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

టీషర్ట్‌ల పంపిణీ..

చిన్నచింతకుంట: మండలంలోని ఉంద్యాల ఎంబీ హెర్మోన్ చర్చిలో ఈస్టర్ పండగను పురస్కరించుకొని ఆదివారం క్రైస్తవులకు ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి టీషర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము, యాకూబ్, చిన్నరాయుడు, రాము, మహిపాల్, బాలకృష్ణరెడ్డి, లింగారెడ్డి, మాసన్న పాల్గొన్నారు.

తైక్వాండోలో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు సాధించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌బాబు మాట్లాడుతూ తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో 30 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా ఎల్లో రెండు బెల్టులు, గ్రీన్ 11 బెల్టులు, గ్రీన్–1 రెండు, బ్లూ ఐదు బెల్టులు, బ్లూ–1 ఐదు బెల్టులు, రెడ్ ఐదు బెల్టులు సాధించినట్లు తెలిపారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో తైక్వాండో క్రీడకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జిల్లాలో తైక్వాండో క్రీడా అభివృద్ధి కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో సంఘం కోశాధికారి ప్రవీణ్‌కుమార్, సీనియర్ తైక్వాండో కోచ్ శంకర్, రాజు, వెంకటేశ్, లయ, వీణ పాల్గొన్నారు.

ఇంటర్నల్ రోడ్డు మరమ్మతు చేపట్టాలి



మరమ్మతు చేపట్టని భూత్పూర్–జడ్చర్ల వెళ్లే ఇంటర్నల్ రహదారి

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తా నుంచి జడ్చర్ల వైపు వెళ్లే ఇంటర్నల్ రహదారి మరమ్మతు చేపట్టాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారి విస్తీర్ణంలో భాగంగా ఎల్ అండ్‌టీ కంపెనీ వారు 2008లో చౌరస్తాలో బ్రిడ్జి, రహదారి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన నాటి నుంచి రెండు, మూడు సార్లు మాత్రమే ఇంటర్నల్ రోడ్డు మరమ్మతు నిర్వహించారు. ఇటీవల కాలంలో మిషన్ భగీరథ నీటి కోసం ఇంటర్నల్ రహదారి, రోడ్డు పక్కన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడంతో రోడ్డు గుంతలుగా ఏర్పడింది. మూడు వైపులా మరమ్మతు చేపట్టినా, జడ్చర్ల వైపు ఇంటర్నల్ రోడ్డు మరమ్మతు ఎందుకు చేపట్టడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎల్‌అండ్‌టీ అధికారులు చొరవ తీసుకొని రహదారి మరమ్మతు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో 1998–99వ సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక తహసీల్దార్ మంజుల చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు రాజు, సలీం, డాక్టర్ హఫీజ్, నరేష్, టైలర్ శ్రీను, దేవన్న, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.